సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 14 । జూలై । 2023
I



ఆలయాల అభివృద్ధికి కృషి

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పేర్కొన్నారు.

- IIలో ▸



నిబంధనలు పాటించాలి

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
29.4 /23.3

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఉదయం బలమైన గాలులు వీస్తాయి. జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

పోడు రగడ..

- జిల్లాలో 32,435 ఎకరాలకు దరఖాస్తు చేసుకున్న 14,050 మంది
- 8,611 ఎకరాలకు గాను 4,229 మందికే ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు
- ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్నాం.. పట్టాలు ఇవ్వాల్సిందేనంటున్న గిరిజనులు
- ధర్పల్లి మండలం డీబీ తండాలో జీపీకి తాళం వేసిన పోడు రైతులు
- ప్రాణభయం ఉందంటున్న అటవీ అధికారులు



గ్రామ పంచాయతీకి తాళం వేసి నిరసన తెలుపుతున్న డీబీ తండావాసులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : పోడు భూముల రగడ మళ్లీ మొదటికి కొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల పరిధిలోని 124 గ్రామాల నుంచి మొత్తం 32,435 ఎకరాలకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇవ్వాలని కోరుతూ 14,050 మంది గిరిజన రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఇందులో 8,611 ఎకరాలకు గాను 4,229 మంది పోడుదారులకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా కేవలం 25 శాతం మాత్రమే పట్టాలు ఇవ్వడంతో గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు ఇవ్వకుండా కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న వారికి ఇచ్చారంటూ పోడు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులిచ్చిన వారికి మాత్రమే పట్టాలు ఇచ్చారని, ఎకరానికి రూ. 20 వేల నుంచి రూ.1 లక్ష వరకు చేతులు మారినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రజావాణికి వస్తున్న దరఖాస్తుల్లో అత్యధికం పోడు భూముల అంశాలే ఉండడం గమనార్హం. ఈ క్రమంలో జిల్లాలోని పలు మండలాల్లో పోడు భూముల కోసం ఆందోళనలు పెరుగుతున్నాయి. గురువారం ధర్పల్లి మండలం డీబీ తండా గ్రామపంచాయతీ కార్యాలయానికి గిరిజన రైతులు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. అధికారుల అవినీతితో తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అటవీ అధికారులు ట్రెంచ్‌లు కొడితే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు.

విధి నిర్వహణకు ఇబ్బందులు

పోడు భూముల ఆందోళన నేపథ్యంలో విధులు నిర్వర్తించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అటవీశాఖ అధికారులు అంటున్నారు. తమను చంపుతామని పలువురు బెదిరిస్తున్నారని చెబుతున్నారు. అటవీ భూములను కాపాడేందుకు వెళితే తమపై రాళ్లు, గులేర్లతో దాడులు చేస్తున్నారని బీట్ అధికారులు, సెక్షన్ అధికారులు, వాచర్లు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులకు వెళ్తున్నామంటున్నారు. 2013 సెప్టెంబర్ 15న ఇందల్వాయి మండలంలో అటవీ క్షేత్రాధికారి గంగయ్యను చంపేశారని, ఇక ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరో అటవీ క్షేత్రాధికారిని గిరిజనులు హతమార్చారని, దీంతో తాము భయంభయంగా విధులు నిర్వహిస్తున్నామంటున్నారు.

25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం



గత 25 సంవత్సరాలుగా పోడు కొట్టుకున్న ఒక ఎకరం భూమిని సాగు చేసుకుంటున్నాం. మా భూమికి ఆర్‌వోఎఫ్‌ఆర్ నంబరు కేటాయించారు. మాకు వేరే చోట భూమి లేదు. పక్కవాళ్లకు పట్టా ఇచ్చి మాకు మాత్రం కావాలనే ఇవ్వలేదు. – కేతావత్ మణి, శివలాల్ తండా, మోపాల్ మండలం

ముగ్గురికి మాత్రమే ఇచ్చారు



మేం రెండెకరాల భూమి ని పోడు కొట్టుకుని ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్నాం. మాకు అటవీ అధికారులు ఆర్‌వోఎఫ్‌ఆర్ నంబర్ కేటాయించినప్పటికీ పట్టా ఇవ్వలేదు. మా ఊళ్లో కేవలం ముగ్గురికే పట్టాలిచ్చారు. ఇంకా చాలామందికి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇవ్వడం లేదు. – కేతావత్ లక్ష్మణ్, శివలాల్ తండా

ఇంకా 30 మందికి పట్టాలు రావాలి



పోడు కొట్టుకున్న భూమిని మేము ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్నాం. ఏడెకరాల్లో ఒక్క ఎకరానికి కూడా పట్టా ఇవ్వలేదు. మా గ్రామంలో మొత్తం 30 మందికి పట్టాలు రావాల్సి ఉంది. – భూక్యా అంబర్‌సింగ్, తాటిపల్లి, సిరికొండ మండలం

పోలీసుల సహాయం తీసుకుంటాం

పోడు పట్టాల పంపిణీ, అటవీ భూముల సంరక్షణ విషయంలో అటవీ సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టాలు రానివాళ్లు గొడవలు, దాడులు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొత్తగా మళ్లీ అటవీ భూములను కబ్జా చేసి సాగు చేస్తున్నారని సమాచారం ఉంది. అలాంటి చర్యలను ఉపేక్షించేది లేదు. అటవీ భూములను కాపాడుతాం. రక్షణ కోసం పోలీసుల సహాయం కోరుతాం. – వికాస్ మీనా, డీఎఫ్‌వో

పోడు పట్టాల కోసం గిరిజనుల నిరసన

ధర్పల్లి: మండలంలోని డీబీ తండాకు చెందిన కొందరు గిరిజనులు పోడు పట్టాల కోసం గ్రామ పంచాయతీ తాళం నిరసన తెలిపారు. తండాలో పోడు భూమి పట్టాల కోసం 370 మంది దరఖాస్తులు చేసుకోగా, 63 మంది లబ్ధిదారులకు మాత్రమే అధికారులు పట్టాలను పంపిణీ చేశారు. 20 ఏళ్ల నుంచి పోడు భూములలో సాగులో ఉన్నవారికి పట్టాలు ఇవ్వకుండా కొత్తగా సాగు చేసుకున్న వారికి పట్టాలు ఇచ్చారని తండావాసులు ఆరోపించారు. పోడు పట్టాల పంపిణీలో అవకతవకలు జరిగాయని ప్రభుత్వం వెంటనే రీసర్వే చేయించి సరైన లబ్ధిదారులకు పట్టాలను అందించాలని డిమాండ్ చేశారు.

వర్ని రేంజ్‌లో ఏడాదిలో పది కేసులు

ఇటీవల వర్ని మండలం శంకోరా గ్రామం వద్ద అటవీ భూముల్లో మొక్కలు నాటేందుకు గంతలు తీయగా గిరిజనులు పూడ్చేశారు. అటవీ సిబ్బందిపై దాడికి దిగారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా పోడు భూముల విషయమై అటవీ అధికారులపై గిరిజనులు దాడులు చేసిన ఘటనలతో ఒక్క వర్ని రేంజ్‌లోనే ఏడాది కాలంలో 10 కేసులు నమోదయ్యాయి. నిజామాబాద్ సౌత్, సిరికొండ, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి రేంజ్‌ల పరిధిలోనూ పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. తమకు ఇంకా బెదిరింపులు వస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

పెట్రోలింగ్ చేయలేకపోతున్నాం..

డీఎఫ్‌వో వికాస్‌మీనా ఆధ్వర్యంలో ఇటీవల ప్రొటెక్షన్ సమావేశం జరిగింది. తమకు ప్రాణభయం ఉందని, డ్యూటీ చేయడం ఇబ్బందిగా మారిందని అటవీ అధికారులు, సిబ్బంది సమావేశంలో వాపోయారు. చాలాసార్లు పోలీసులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఒంటరిగా పెట్రోలింగ్ చేయడం కష్టంగా ఉందని, ఆయుధాలు లేనందున పోలీసు రక్షణ కల్పించాలని కోరారు.

జిల్లాలో 32.6 మి.మీ. వర్షపాతం

సుభాష్‌నగర్: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 32.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. డొంకేశ్వర్, ముప్కాల్, మెండోరా, నందిపేట్, బాల్కొండ, తదితర మండలాల్లో అత్యధికంగా వర్షం కురిసింది. బుధవారం రాత్రి కురిసిన వర్షంతో జిల్లాలో 12 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, 21 మండలాల్లో ఇంకా లోటు వర్షపాతం నమోదైంది. రానున్న రెండ్రోజులు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మండలం	వర్షపాతం (మి.మీ.)		
		నవీపేట	43.5
		మాక్లూర్	37.5
డొంకేశ్వర్	93.3	బోధన్	29.3
ముప్కాల్	91.6	ఎడపల్లి	29.0
మెండోరా	87.6	సాలూర	28.0
నందిపేట	83.0	పోతంగల్	24.3
బాల్కొండ	72.4	మోస్రా	20.0
ఆలూరు	56.0	కమ్మర్‌పల్లి	37.1
ఆర్మూర్	59.9	జక్రాన్‌పల్లి	13.0
మోర్తాడ్	51.0	నిజామాబాద్‌రూరల్	14.4
ఏర్గట్ల	44.4	రుద్రూర్	12.9

వ్యాధి నిరోధక టీకాలు వందశాతం ఇవ్వాలి

- రాష్ట్ర సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ అతుల్ నేగి
- మిషన్ ఇంద్ర ధనుష్‌పై శిక్షణ

నిజామాబాద్ సిటీ: వ్యాధి నిరోధక టీకాలు తీసుకోని వారిని గుర్తించి వందశాతం టీకాలు ఇవ్వాలని రాష్ట్ర సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అతుల్ నేగి జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక న్యూ అంబేద్కర్ భవన్‌లో మిషన్ ఇంద్ర ధనుష్‌పై వైద్యులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు వేయించుకోని వారి పేర్లు నమోదు చేసుకొని వారికి ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు మూడు విడతలుగా టీకాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో మొదటి విడత ఆగస్టు 7 నుంచి 12 వరకు, రెండో విడత సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, మూడో విడత అక్టోబర్ 9 నుంచి 14 వరకు మూడు విడతలుగా మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుదర్శనం, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అశోక్, నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత, కంటి వెలుగు పీవో వెంకటేశ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి పెరిగిన ఇన్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి 4,629 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా 5,800 కాళేశ్వరం నీళ్లు వచ్చి చేరుతున్నాయి. మొత్తం ప్రాజెక్టులో 10,429 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు నీటి మట్టం పెరుగుతోంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 387 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091అడుగుల(90 టీఎంసీలు)కు గాను ప్రస్తుతం 1066.60 అడుగుల (23.04 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కామారెడ్డి జిల్లాకు ఖాతాల బదిలీ

- 1,926 ఖాతాలు ట్రాన్స్‌ఫర్

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జెడ్పీ ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలను కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలుగా వేరు చేయడం జరిగిందని జెడ్పీ సీఈవో గోవింద్ నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లాకు 1,926 ఖాతాలను బదిలీ చేశామన్నారు. సాధారణ భవిష్య నిధిలో ఈ ఏడాది మార్చి 31 వరకు ఉన్న నిధులు రూ. 73,88,74,774 బదిలీ చేశామని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎఫ్ లావాదేవీల కోసం కామారెడ్డి జెడ్పీలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సుందరవద రాజన్, జీపీఎఫ్ పర్యవేక్షకులు సునీతా దేవి, కామారెడ్డి జిల్లా జీపీఎఫ్ పర్యవేక్షకులు మనోహర్ పాల్గొన్నారు.

మెగా కాన్‌క్లేవ్‌కు అర్గుల్ రైతు ఎంపిక



జక్రాన్‌పల్లి: ఢిల్లీలో శుక్రవారం జరుగనున్న మెగా కాన్‌క్లేవ్‌కు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజెషన్స్(ఎఫ్‌పీవో) తరఫున అర్గుల్ రైతు జైడి మధుసూదన్‌రెడ్డి ఎంపికయ్యారు. దీంతో ఆయన ఢిల్లీలో జరిగే సదస్సుకు తరలివెళ్లారు. ఢిల్లీలో ఎఫ్‌పీవోల ద్వారా పీఏసీఎస్‌లను బలోపేతం చేసే కార్యక్రమాన్ని కేంద్ర హోంమంత్రి, సహకార మంత్రి అమిత్‌షా ప్రారంభించనున్నట్లు మధుసూదన్ రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ 'సహకార్ సే సమృద్ధి' దార్శనికతను సాకారం చేయడానికి ఇటీవల సహకార రంగంలో 1100 కొత్త ఎఫ్‌పీవోల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ పథకం కింద ఒక్కో ఎఫ్‌పీవోకు రూ. 33లక్షలు ఆర్థిక సహాయం అందించి ఎఫ్‌పీవోలను ప్రోత్సహించడంతో పాటు హ్యాండ్ హోల్డింగ్ చేయడం, వ్యవసాయంపై ఆధారపడిన వారి జీవన నాణ్యతను మెరుగుపరచడంలో ఎఫ్‌పీవోలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

రేపు తెలంగాణ వర్సిటీ బంద్‌కు పిలుపు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీలో సమస్యల పరిష్కారం కోసం శనివారం వర్సిటీ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి శ్రీశైలం తెలిపారు. గురువారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మినీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రధానంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. క్యాంపస్ హెల్త్‌సెంటర్‌లో రెగ్యులర్ డాక్టర్ లేక అత్యవసర సమయంలో విద్యార్థులకు చికిత్స అందించే వారు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లేదంటే దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ తెయూ ఉపాధ్యక్షులు సాయిప్రసాద్, వెంకటేశ్, సహాయ కార్యదర్శి సంధ్యారెడ్డి, సభ్యులు నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రిజిస్ట్రార్ యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్యాకేజీ21 ద్వారా పంటలకు సాగునీరు



మోర్తాడ్‌లో కుకునూర్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్‌తో పాటు ఇతర ప్రాంతాల రైతులకు సాగునీరు అందించేందుకు ప్యాకేజీ 21 ద్వారా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా నీరు ఇచ్చినట్లే.. ప్యాకేజీ 21 ద్వారా ప్రతి మూడు ఎకరాలకు అవుట్‌లెట్ పెట్టి పంటలకు సాగునీటి కష్టాలను తప్పించనున్నామని పేర్కొన్నారు. గురువారం తక్కూరివాడ నుంచి కుకునూర్ లింక్‌రోడ్డు పనులకు, మోర్తాడ్ నుంచి వడ్యాట్ మీదుగా బషీరాబాద్ వరకు రోడ్డు వెడల్పు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురువకపోయినా సాగునీటి కొరత లేకుండా చూడడానికి కాళేశ్వరం నీటిని ఎస్సారెస్పీకి తరలిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు భరోసానిస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం హాని చేసేలా వ్యవహరిస్తుందన్నారు. రైతుబంధు, రైతుబీమా ఇతరాత్ర పథకాలతో రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, నాయకులు కోటపాటి నర్సింహనాయుడు, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ దొన్కల్ సంజీవరెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు బద్దం రవి, వైస్ ఎంపీపీ తొగటి శ్రీనివాస్, సర్పంచ్‌లు భోగ ధరణి, రూప, నాయకులు కె.చిన్న రాజేశ్వర్, ఎలాల రాజ్‌పాల్ పాల్గొన్నారు.

దాశరథి జయంతికి ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ
- అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్‌లతో కలిసి ఏర్పాట్ల పరిశీలన



ఖిల్లా జైలులో దాశరథి జయంతి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మామిడి హరికృష్ణ, ఎమ్మెల్యే

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని ఖిల్లా జైలులో దాశరథి జయంతి ఉత్సవాలను ఈనెల 22న పెద్దఎత్తున నిర్వహించాలని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అధికారులను ఆదేశించారు. జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మేయర్ నీతూ కిరణ్, అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా తదితరులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అధికార యంత్రాంగం చేస్తున్న ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. దాశరథిని రాజకీయ ఖైదు చేసిన ఖిల్లా జైలును సందర్శించి, జయంతి ఉత్సవాల వేదిక, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. జయంతి ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాటు చేయాలని సూచించారు. దాశరథి, ఆళ్వార్‌స్వామి తదితరుల సాహిత్యం ప్రతిబింబించేలా ఫ్లెక్సీలు, విద్యుద్దీపాలు, రంగులతో ప్రాంగణమంతా ఆకట్టుకునేలా అందంగా అలంకరించాలన్నారు. దాశరథిని జైలులో నిర్బంధించిన ఆనాటి పరిస్థితులు గుర్తు చేసేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. దాశరథిని నిర్బంధించిన జైలు బ్యారక్‌ను ప్రజలు సందర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది కళాకారులతో నగరంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. పెద్ద సంఖ్యలో కవులు, రచయితలు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారుల ర్యాలీ కొనసాగనున్న రూట్‌ను పరిశీలించారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో రవికుమార్, ఇన్‌చార్జి జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి సింహాచలం, నార్త్ తహసీల్దార్ సుదర్శన్, మున్సిపల్ ఏఈ ఇనాయత్, భారత జాగృతి సంస్థ రాష్ట్ర కార్యదర్శి నవీనాచారి, జిల్లా ప్రతినిధులు అవంతిరావు, నరాల సుధాకర్ ఉన్నారు.

269 మంది జేపీఎస్‌లకు క్రమబద్ధీకరణ!

- సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు కసరత్తు
- పంచాయతీ కార్యదర్శుల పనితీరు ఆధారంగా..
- జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు

సుభాష్‌నగర్/మోర్తాడ్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు సీఎం కేసీఆర్ ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వారం, పదిరోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించడంతో అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. జేపీఎస్‌ల పనితీరు(ఫర్ఫార్మెన్స్) ఆధారంగా క్రమబద్ధీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో రెండురోజుల్లో వీటికి సంబంధించి పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు విడుదల కానున్నట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా 269 మంది జేపీఎస్‌లు ఇటీవల నాలుగేళ్లు పూర్తి చేసుకున్నారు. వారందరూ రెగ్యులరైజ్ అయ్యే అవకాశముందని జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారులు పేర్కొంటున్నారు. జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ అప్రూవల్ చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో 530 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో 391 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 30 మంది ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు, 109 మంది సీనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. 391 మందిలో 269 మంది జేపీఎస్‌ల ప్రొబేషనరీ కాలం 2023 ఏప్రిల్ 11 నాటితో ముగిసింది. మిగతా వారిని మెరిట్ ఆధారంగా తదనంతర కాలంలో విధుల్లోకి తీసుకున్నారు. వారు కూడా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న తర్వాత రెగ్యులరైజ్ అవుతారు. కాగా ఏప్రిల్‌లో తమను రెగ్యులరైజ్ చేయాలని జేపీఎస్‌లు సమ్మెకు దిగగా, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రావడంతో సమ్మె విరమించిన విషయం తెలిసిందే.

కలెక్టర్ చైర్మన్‌గా..

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం కలెక్టర్ చైర్మన్‌గా జిల్లాస్థాయిలో కమిటీ ఏర్పాటు చేసింది. అందులో కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఎఫ్‌వో, ఎస్పీ లేదా సీపీ సభ్యులుగా ఉంటారు. జేపీఎస్‌ల పనితీరును పరిశీలించి కమిటీ అప్రూవల్స్ చేయాల్సి ఉంటుంది.

అందని మార్గదర్శకాలు

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు సంబంధించి ఇంకా స్పష్టమైన మార్గదర్శకాలు అందలేదని జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారులు పేర్కొంటున్నారు. మరో రెండురోజుల్లో మార్గదర్శకాలు రావచ్చని తెలిసింది. కానీ ఇప్పటికే జిల్లాలోని జేపీఎస్‌ల పనితీరును మంత్లీ యాక్టివిటీస్ స్టేట్‌మెంట్‌లో నమోదు చేస్తున్నారు. గ్రామసభలు, హరితహారం, అటెండెన్స్, పన్నుల వసూళ్లు, పల్లె ప్రగతి పనులు, శానిటేషన్, తదితర వాటిల్లో జేపీఎస్‌ల పనితీరును పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిసింది. స్వచ్ఛభారత్, ఇతర విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం అవార్డులు రావడంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది



జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు అందలేదు. పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 269 మంది రెగ్యులర్ అవుతారని ఆశిస్తున్నాం. జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులే వారి పనితీరుకు నిదర్శనం. – జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

హిందూ సమాజం జాగృతం కావాలి



నూతన కమిటీతో తమ్మల కృష్ణ

సుభాష్‌నగర్: హిందూ సమాజంపై దాడులు ఇటీవల కాలంలో తీవ్రమయ్యాయని, హిందూ సమాజం జాగృతం కావాల్సిన అవసరం ఉందని విశ్వ హిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ పేర్కొన్నారు. గురువారం నగరంలో ని వీహెచ్‌పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల భాగ్యనగర్‌లో నిర్వహించిన ప్రాంత సమావేశాల్లో యూసీసీ(కామన్ సివిల్ కోడ్), ఆగస్టులో నిర్వహించనున్న సాధు సంతులతో పాదయాత్ర, నవంబర్‌లో శౌర్య జాగరణ యాత్ర కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. విభాగ ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ కత్రోజి నరేందర్, జిల్లా సత్సంగ్ ప్రముఖ్ రాజేశ్ పాల్గొన్నారు.

వీహెచ్‌పీ నూతన కమిటీ

విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా దినేశ్ ఠాకూర్, ఉపాధ్యక్షుడిగా రెబ్బ ఆనంద్, కార్యదర్శిగా గాజుల దయానంద్, సహ కార్యదర్శులుగా ధాత్రిక రమేశ్, అరుణ్‌రెడ్డి, సహ శేష సంపర్క్‌గా అల్జాపూర్ అక్షయ్, సహ కోశాధికారిగా నాంపెల్లి శేఖర్, ప్రచార్ ప్రముఖ్‌గా బోచ్‌కర్ నిఖిల్, అర్చక పురోహిత్‌గా శశాంక్ జోషి ఎన్నికయ్యారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సైతం..

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు. ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్‌కు ఆయా డివిజన్ల ఆర్డీవోలు, నిజామాబాద్ అర్బన్‌కు మున్సిపల్ కమిషనర్, బాల్కొండకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నియమితులయ్యారు. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల పరిధిలోని మండలాల తహసీల్దార్లను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమించారు.

క్లుప్తంగా

నల్లబెల్లం, పటిక స్వాధీనం



ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో పక్కా సమాచారం మేరకు నల్లబెల్లం, పట్టికను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ సుబ్బారావు తెలిపారు. గురువారం ముంబాయి నుంచి వచ్చే దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ఎస్–6, ఎస్–7 బోగీలలో తనిఖీలు నిర్వహించగా 13 సంచుల నల్లబెల్లం, 6 సంచుల పట్టిక తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వీటిని స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ ఎస్సై మల్లేష్‌కు అందజేసినట్లు తెలిపారు.

పాఠశాలలో పాము కలకలం



బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని ఫత్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నాగుపాము కలకం సృష్టించింది. పాఠశాలలో విద్యార్థులు చదువుతున్న గదిలోకి వెళ్లింది. గమనించిన ఉపాధ్యాయురాలు వినీత వెంటనే విద్యార్థులను గదిలో నుంచి బయటకు పంపించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే గ్రామస్తులను పిలిపించి పామును కొట్టి చంపేశారు. పాఠశాల వెనక పిచ్చి మొక్కలు ఉండడంతో పాములు, ఇతర విషపు పురుగులు గదుల్లోకి వస్తున్నాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి..

ఇందల్వాయి : తన భార్యతో వివాహేతర సంబంధం నెరపుతున్నాడని ఓ వ్యక్తిపై ఆమె భర్త, కొడుకు కలిసి దాడి చేసిన ఘటన నల్లవెల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తిర్మల్ అనే వ్యక్తి గ్రామంలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయమై ఆమె భర్త, కొడుకు కలిసి గురువారం పొలం నుంచి వస్తున్న తిర్మల్‌పై దాడి చేశారు. తిర్మల్ ప్రస్తుతం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం



సిరికొండ: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద మిషన్ భగీరథ్ పైపులైన్ ధ్వంసమైంది. ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీ కోసం జేసీబీతో మట్టిని తొలగిస్తుండగా పైపులైన్ పగలడంతో ఒక్కసారిగా నీళ్లు పెద్ద ఎత్తున విరజిమ్మాయి. అధికారులకు సమాచారం ఇవ్వడంతో నీటి సరఫరా నిలిపివేసి మరమ్మతు పనులు చేపడుతున్నారు.

నిందితులను వదిలేసిన రైల్వేపోలీసులు..!

- విచారించి, వివరాలు తీసుకొని..
- రైల్వే పోలీసుల వద్దే బాధితుల బ్యాగులు
- బాధితులు ఆంధ్ర, రాయలసీమకు చెందినవారు



ఖలీల్‌వాడి : నవీపేట్ శివారులో సాయినగర్ షిర్డీలో రైలులో బుధవారం అర్ధరాత్రి జరిగిన చోరీ సంఘటనలో నిందితులను రైల్వే పోలీసులు వదిలేసినట్లుగా సమాచారం. నిజామాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న రైలు నవీపేట వద్ద క్రాసింగ్ ఉందని ఆపగా అక్కడ మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన తొమ్మిది మంది యువతులు ఎక్కి ప్రయాణికుల బ్యాగులు చోరీ చేసిన విషయం విదితమే.. రైలులో బ్యాగ్‌లు చోరీ జరిగినట్లు తెలుసుకున్న ప్రయాణికులు బాసర వద్ద రైలును చైన్ లాగి ఆపిన విషయం తెలిసిందే. అయితే రైలు ఆగగానే పారిపోతున్న యువతుల్లో కొందరిని రైలు ప్రయాణికులే పట్టుకుని రైల్వే పోలీసులకు అప్పగించారు. బాధితులు సైతం తమ పూర్తి వివరాలతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ బ్యాగుల్లో ల్యాప్‌టాప్‌తో డబ్బులు, ల్యాప్‌టాప్, ఓ మహిళ మెడలో నుంచి చైన్ ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు గుంటూరు, విజయవాడ, నెల్లూరు, వైజాగ్, కడపకు చెందిన ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది.

మర్మమేమిటో..!

బాసర రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత తొమ్మిది మంది యువతులను విచారించి వదిలి వేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ యువతులు మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందినట్లు వారుగా గుర్తించారు. సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లో చోరీపై పోలీసులు పూర్తి స్థాయి విచారణ చేపట్టలేదనే విమర్శలున్నాయి. ప్రయాణికులు బాసర వద్ద చైన్ లాగిన తర్వాత అక్కడి సీసీ పుటేజీలు, అలాగే యువతులు నవీపేట్ రైల్వేస్టేషన్ వద్ద ఎక్కిన సీసీటీవీ పుటేజీలను పరిశీలిస్తే చోరీ విషయమై స్పష్టత వస్తుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. బాసర వద్ద ఉన్న సీసీపుటేజీల్లో యువతులు బ్యాగులు తీసుకుని స్లీపర్ కోచ్ నుంచి జనరల్ బోగీల్లోకి వెళ్తున్నట్లుగా రికార్డయినట్లు సమాచారం. రైల్వే ట్రాక్ పక్కన పడ్డ బ్యాగులు రైల్వే పోలీసుల వద్ద ఉన్నట్లు తెలిసింది. ఈ బ్యాగులు రైల్వేట్రాక్ పక్కకు ఎలా వచ్చాయనే విషయపై రైల్వేపోలీసులు సరైన విచారణ చేయట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రైలులో చోరీపై ఎస్పీ, ఎస్పీ ఆరా..!

సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లో చోరీపై రైల్వే ఎస్పీ, రైల్వే స్పెషల్ బ్రాంచ్ అధికారులు రైల్వే అధికారుల నుంచి వివరాలను సేకరించినట్లు సమాచారం. ఈ చోరీలో ప్రయాణికులు పట్టించిన నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. చోరీకి పాల్పడ్డ యువతులను ఆర్‌పీఎఫ్ పోలీసులు రైలులో నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు గురువారం ఉదయం తీసుకొచ్చినట్లు తెలిసింది. వారిని రైల్వే పోలీసులకు అప్పజెప్పినట్లు సమాచారం.

నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత



మాట్లాడుతున్న సమన్వయకర్త అశోక్

నిజామాబాద్ సిటీ : నులిపురుగుల ద్వారా పిల్లల్లో తీవ్రమైన రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక మానసిక ఎదుగుదల లోపిస్తుందని ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. గురువారం జీజీహెచ్‌లోని 7వ అంతస్తులో సమావేశం హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిలిపురుగుల నివారణపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ నులిపురుగుల సమస్యతో బాధపడుతున్న పిల్లలకు మూడు శాఖల సమన్వయంతో ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు పిల్లలకు జూలై 20న ఆల్బెండజోల్ మాత్రను అర్హులందరికీ ఇస్తామన్నారు. జూలై 20న స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌లో అల్బెండజోల్ మాత్రను అందించాలన్నారు. 20న మిస్సయిన పిల్లలకు జూలై 27న మాత్రలను అందించి వందశాతం టార్గెట్ పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు వ్యవహరించారు. డీఐఈవో రఘురాజ్, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, విద్యాశాఖ సీనియర్ అధికారి ఎంఈవో రాజగంగారెడ్డి, ఆర్‌బీఎస్‌కే జిల్లా మేనేజర్ సచిన్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కార్మిక గర్జనను జయప్రదం చేయాలి

ఖలీల్‌వాడి : హైదరాబాద్‌లో ఆగస్టు 4న జరిగే ఐఎఫ్‌టీయూ కార్మిక గర్జనను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ అన్నారు. గురువారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లీలోని శ్రామికభవన్‌లో కార్మిక గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గానికి అందుతున్న వేతనాలతో వారి జీవనం కష్టంగా మారిందన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక అనుకూల చట్టాలను రద్దుచేసి, కార్పొరేట్ కంపెనీలకు అనుకూల చట్టాలను తీసుకొస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా, శ్రమదోపిడీకి పాల్పడుతోందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లాధ్యక్షులు ముత్తన్న తదితరులున్నారు.

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన బస్సు

మాక్లూర్ : ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోయి నిజామాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ప్రమాదానికి గురైన సంఘటన గురువారం మండలంలోని బోర్గాం (కె) చెరువు కట్ట వద్ద జరిగింది. డ్రైవర్ చాకచక్యంతో 60 మంది విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పాఠశాల యాజమాన్యం మరో బస్సును తెప్పించి విద్యార్థులను స్కూల్‌కు తరలించా రు. మానిక్‌భండార్ చెక్క నుంచి బోర్గాం (కె) వరకు ఇటీవలే బీటీ రోడ్డు వేశారు. రోడ్డు వేసిన 10 రోజులకే కురిసిన వర్షాలకు చెరువుకట్టపై రోడ్డు కృంగిపోయి ప్రమాదకరంగా మారింది. రోడ్డును సరి చేయాలని గ్రామస్తులు గతంలో కాంట్రాక్టర్‌ను కోరారు. 'సాక్షి'లో ఈ రోడ్డుపై కథనాలు ప్రచురితం కాగా పైపైనే పనులు చేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. స్థానికులు కాంట్రాక్టర్, సంబంధిత ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫ్లెక్సీ బోర్డును ఢీకొని ఒకరి మృతి



మృతుడు సాయిలు

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ రూరల్ మండలం గాంధీనగర్ వద్ద గురువారం ఫ్లెక్సీ బోర్డును ఢీకొని ఓ సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త మృతి చెందాడు. రూరల్ ఎస్సై లింబాద్రి వివరాల ప్రకారం.. అంబం గ్రామం రుద్రూర్ మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త చాకలి సాయిలు(47) గురువారం అదే గ్రామానికి చెందిన కల్లూరు లక్ష్మయ్యతో తన బైక్‌పై నిజామాబాద్‌కు బయలుదేరాడు. గాంధీనగర్ వద్ద బైక్ అదుపుతప్పి ఫ్లెక్సీబోర్డును ఢీకొనగా వెనక కూర్చున్న సాయిలు తలకు తీవ్ర గాయాలయ్యాయి. జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సాయిలు మృతి చెందాడు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా: మహిళలకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

డిచ్‌పల్లి : మండలంలోని నడిపల్లి శివారులో డిచ్‌పల్లి – నిజామాబాద్ ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ నుంచి నలుగురు ప్రయాణీకులతో జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్ గ్రామానికి వెళ్తున్న ఆటో నడిపల్లి శివారులో ముందున్న కారును ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నిస్తూ డివైడర్‌ను ఢీకొని ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న కళావతికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో బాధితులను పైలట్ కిషన్, ఈఎంటీ సురేష్ జీజీహెచ్‌కు తరలించారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దుస్తులు ఉతికేందుకు వెళ్లి..



ఐశ్వర్య మృతదేహం

బాన్సువాడ/నస్రుల్లాబాద్ : బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన బోయిని ఐశ్వర్య(17) అనే బాలిక గురువారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు బీర్కూర్ ఎస్సై బాల్‌రెడ్డి తెలిపారు. ఐశ్వర్య ఉదయం దుస్తులు ఉతికేందుకు ఊర చెరువుకు వెళ్లిందని, దుస్తులు ఉతికే క్రమంలో కాలుజారి చెరువులో పడగానే మూర్ఛ రావడంతో నీటిలో మునిగి మృతి చెందిందనిన్నారు. మృతురాలు బీర్కూర్ మండల కేంద్రంలో 9వ తరగతి చదువుతోందన్నారు. మృతురాలి తండ్రి బోయిని హన్మాండ్లు ఇచ్చిన ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి యువకుడు..

గాంధారి(ఎల్లారెడ్డి) : మండలంలోని సీతాయిపల్లి చెరువులో ప్రమాదవశాత్తు పడి గ్రామానికి చెందిన చెంచల హన్మాండ్లు (26) మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. సర్వాపూర్ గ్రామానికి చెందిన హన్మాండ్లు సీతాయిపల్లి గ్రామానికి చెంచల మొగులయ్య కూతురు మోహన గాంధీ ఇంటికి ఏడాదిన్నర క్రితం ఇల్లరికం వచ్చాడు. సోమవారం సీతాయిపల్లికి తిరిగి వచ్చాడు. మంగళవారం మాధ్యాహ్నం బయటకు వెళ్లి వస్తానని భార్యకు చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని సీతాయి చెరువులో హన్మాండ్లు మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హన్మాండ్లుకు మూర్ఛ ఉందని, కాలకృత్యాల కోసం చెరువుకు వెళ్లి అందులో పడి మృతి చెంది ఉంటాడని మృతిడి మామ మొగులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టన్నెల్‌లో పడి వలస కార్మికుడి మృతి

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- గోప్యంగా ఉంచిన కంపెనీ ప్రతినిధులు, పోలీసులు..!

మోపాల్ (నిజామాబాద్‌రూరల్) : మండలంలోని మంచిప్ప కాళేశ్వరం ప్రాజెక్ట్ వద్దగల ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న వలస కార్మికుడు అర్జున్ పుర్తి (23) పంప్‌హౌజ్ టన్నెల్‌లో పడి మృతిచెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కంపెనీ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ పుర్తి రెండు నెలల క్రితం లక్ష్మీ ట్రాన్స్‌మిషన్ కంపెనీ పని నిమిత్తం సబ్‌స్టేషన్‌లో పని చేసేందుకు మంచిప్పకు వచ్చాడు. మంగళవారం విధులు ముగించుకున్న అర్జున్ పుర్తి సహా మరో ముగ్గురు 21వ ప్యాకేజీ పంప్‌హౌజ్ టన్నెల్ వైపు వెళ్లారు. అక్కడ అర్జున్ పుర్తి ప్రమాదవశాత్తు కాలుజారి సుమారు 70 ఫీట్ల లోతున్న టన్నెల్‌లో పడి మృతిచెందాడు. ఆరోజు మిగితా ముగ్గురు విషయాన్ని బయటికి పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. బుధవారం ఉదయం ప్రాజెక్ట్ కంపెనీ ప్రతినిధులకు అర్జున్ టన్నెల్‌లో పడిపోయాడని చెప్పగా వారు టన్నెల్‌లోకి వెళ్లి పరిశీలించారు. అర్జున్ మృతిచెంది ఉండటంతో ప్రాజెక్ట్ ప్రతినిధులు పోలీసులకు సమాచార మిచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు. లక్ష్మీ ట్రాన్స్‌మిషన్ సైట్ ఇంజినీర్ రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో జార్ఖండ్‌కు తరలించారు. కాగా వలస కార్మికుడి మృతి విషయాన్ని కంపెనీ ప్రతినిధులు, పోలీసులు గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.

లారీ ఢీకొని రెండు ఆవులు మృతి



ధర్పల్లి : మండలంలోని మద్దూల్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న ఆవుల మందపైకి లారీ వేగంగా దూసుకెళ్లడంతో రెండు ఆవులు మృతి చెందాయి. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ మండలం దూప్యనాయక్ తండాకు చెందిన రైతు బంతిలాల్ తన ఆవుల మందను గురువారం మద్దూల్ చౌరస్తా వద్ద రోడ్డు దాటిస్తున్న సమయంలో ఇందల్వాయి నుండి ధర్పల్లికి అతివేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు ఆవులు మృతి చెందగా మరో రెండు ఆవులు పరిస్థితి విషమంగా ఉంది. రైతు బంతిలాల్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి కేసులో బైండోవర్

ఖలీల్‌వాడి : నగరంలోని రెండో పోలీస్‌స్టేషన్ పరిధిలోని దారుగల్లీలో మీసేవ సెంటర్ వద్ద గంజాయి అమ్మడానికి వెళ్తున్న బర్కత్‌పురాలోని లైసగల్లీకి చెందిన షేక్ అఫ్రోజ్(28)ను అరెస్ట్ చేసి బైండోవర్ చేసినట్లు ఎస్సై పూర్ణేశ్వర్ తెలిపారు. నిషేధిత ఎండు గంజాయిని నిర్మల్‌కు చెందిన సల్మాన్ వద్ద కొనుగోలు చేసి అఫ్రోజ్ వాటిని ప్యాకెట్ల రూపంలో చేసి అనుమానం రాకుండా విత్తనాల సంచిలో తీసుకెళ్లి అమ్మేందుకు వెళ్తున్నాడన్నారు. పక్కా సమాచారం మేరకు అతడి వద్ద నుంచి రూ. 2000 విలువైన 125 గ్రాముల ఎండు గంజాయి అతడి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అయితే గతకొన్ని రోజుల క్రితం బోధన్ బస్టాండ్ వద్ద గంజాయి అమ్ముదామని వెళ్తున్న షేక్ అఫ్రోజ్‌ను ఆబ్కారీ పోలీసులు పట్టుకున్నారు. అప్పట్లో ఇతడిపై కేసు నమోదైందన్నారు. ప్రస్తుతం నిందితుడిని తహసీల్దార్ ప్రసాద్ ముందు బైండోవర్ చేసినట్లు చెప్పారు.

నిందితుడికి జైలు..

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో జనవరి నెలలో ఓ షాప్‌లో జరిగిన చోరీ కేసులో నిందితుడికి ఆర్నెళ్ల జైలు శిక్ష, రూ. 500 జరిమానా పడింది. ఈ కేసుకు సంబంధించి స్థానిక ఎస్సై రాజశేఖర్ తెలిపిన ప్రకారం ఉప్లూర్‌లో జనవరిలో చిలుకూరి రమేశ్‌కు చెందిన దుకాణంలో నగదు చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన అల్లెపు రాజేష్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నస్రుల్లాబాద్(బీర్కూర్) : బీర్కూర్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఎదురుగా కోటగిరి–బీర్కూర్ ప్రధాన రహదారిపై బైక్‌పై వెళ్తున్న కొడిచర్లకు చెందిన ఓ వ్యక్తిని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బీర్కూర్ నుంచి కోటగిరి వైపునకు బైక్‌పై వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టడంతో కాలు విరిగిందన్నారు. క్షతగాత్రుడిని స్థానికులు 108లో బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలించినట్లు సమాచారం.

చంద్రబాబు ఆత్మే రేవంత్‌రెడ్డి

- దమ్ముంటే అర్వింద్, రేవంత్‌రెడ్డి నాపై పోటీ చేస్తానని ప్రకటించాలి
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లాధ్యక్షుడు జీవన్‌రెడ్డి

నిజామాబాద్ నాగారం : చంద్రబాబు ఆత్మే రేవంత్‌రెడ్డి అని, రేవంత్‌రెడ్డి 3 గంటల సిద్ధాంతంతో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ డిక్లేర్ అయ్యిందని.. అర్వింద్, రేవంత్‌రెడ్డి ఒక వైపు.. తానొక వైపు ఉన్నానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పవర్‌తో పెట్టుకున్న చంద్రబాబు అడ్రస్ లేకుండా పోయారన్నారు. రేవంత్‌రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ విత్తనమని, ఎంపీ అర్వింద్, రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లు ఆర్మూర్‌లో దమ్ముంటే నాపై పోటీ చేస్తామని ప్రకటించాలన్నారు. రెండు కళ్ల సిద్ధాంతంలో తెలంగాణలో చంద్రబాబు ఖేల్ ఖతం అయ్యిందన్నారు. రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ సిద్ధాంతం అని, కేసీఆర్ మూడు పంటలు సిద్ధాంతమన్నారు. ధరణితో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ డిక్లేర్ అని, ఉమ్మడి జిల్లా వార్ వన్‌సైడ్‌గా ఉంటుందన్నారు. రాష్ట్రంలో రైతుబంధు, 24 గంటల కరెంట్ ఇవ్వడం తప్పా అని అర్బన్ ఎ మ్మెల్యే బిగాల ప్రశ్నించారు. రైతయితే చాలు రైతుబంధు ఇస్తానన్న ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. రే వంత్‌రెడ్డి, చంద్రబాబు దగ్గర నుంచి వచ్చిన వాడు కాబట్టే ఇలాంటి ఆలోచనలు వచ్చాయన్నారు. టీడీపీ ఏపీలో పుట్టగతులుండవన్నారు. తెలంగాణలో పరీక్షలపై ఏపీ మంత్రి బొత్స మాట్లాడడం పద్ధతి కాదన్నారు. మేయర్ నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించారు



మాట్లాడుతున్న గడుగు గంగాధర్

ఖలీల్‌వాడి : పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అమెరికాలో కరెంట్‌పై అన్న మాటలను బీఆర్‌ఎస్ పార్టీ వక్రీకరించిందని పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్, సీనియర్ కాంగ్రెస్ నేత బాడ్సి శేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గడుగు గంగాధర్ నివాసంలో వారు మాట్లాడారు. 2014లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అప్పటి సీఎం వైఎస్సార్ ఉచిత కరెంట్‌పై తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ అప్పుడు అసెంబ్లీలో మాట్లాడుతూ ఉచిత కరెంట్ ఇచ్చింది వైఎస్సారే అని చెప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు రైతుల పక్షాన ఉంటుందన్నారు. జిల్లాలోని డిచ్‌పల్లి వద్ద కాంగ్రెస్ హయంలోనే 400 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్తారన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి



అర్చకుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల

నిజామాబాద్ సిటీ : వివిధ కులాలకు చెందిన వారి పిల్లలు తమ కుల వృత్తులను వదిలి ఇతర రంగాల వైపు వెళ్తున్న తరుణంలో అర్చకుల పిల్లలు అర్చక వృత్తిని వదిలి వెళ్లకుండా వేదం బతకాలి, వేదాన్ని బతికించేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. అందులో భాగంగానే దూప దీపా నైవేద్యానికి వేతనం పెంచారన్నారు. గురువారం నగరంలోని గాజుల్‌పేట్ వీరభద్ర స్వామి ఆలయంలో దూపదీప నైవేద్య అర్చక సంఘం ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఆత్మీయ సమ్మేళన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలను సీఎం అభివృద్ధి చేస్తున్నారని, అర్చకుల తర్వాత వారి పిల్లలు అర్చకులుగా స్థిరపడేలా కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాకముందు దీపదూప నైవేద్యానికి రూ. 2,500 ఉండగా సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోపు రూ. 6 వేలు చేశారని, అనంతరం ఈ వేతనం సరిపోవటంలేదని ఇటీవలే రూ. 10 వేలు చేశారన్నారు. నగరంలో మినీ ట్యాంక్‌బండ్‌పై గణేశ్ ఆలయం పునర్నిర్మాణం చేశామని, ముదిరాజ్ సంఘంకు రూ. 50 లక్షలు ఇచ్చామని, పెద్దమ్మ గుడి నిర్మాణం జరుగుతుందని, కోటగల్లీ మార్కెండేయ మందిరానికి రూ. 25 లక్షలు, హమల్‌వాడి సాయి బాబా గుడికి రూ. 50 లక్షలు, రాహుకేత్ గుడికి వెళ్లేందుకు రూ. కోటితో బీటీరోడ్డు నిర్మాణం, సారంగపూర్ హనుమాన్ మందిరం మార్గానికి రూ. 1.50 లక్షలు, నాందేవ్‌వాడ విఠలేశ్వర ఆలయంకు నాలుగు షెటర్లు మంజూరు చేశామన్నారు. గుడిలో రాజకీయాల గురించి మాట్లాడే పార్టీ తమది కాదన్నారు. ఆలయాల్లో నైవేద్యం పెట్టని అర్చకుల పేర్లు పథకంలో తొలగిస్తామని దేవాదాయ సహాయక కమిషనర్ సుప్రియ అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ మాట్లాడుతూ దూపదీప నైవేద్యం అర్చకులు ఐక్యంగా ఉండాలని, రాబోవు రోజుల్లో వేతనం రూ. 23వేలు సాధించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అర్చక సఘం నిజామాబాద్ అధ్యక్షుడు రాచప్పా, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజన్నస్వామి, తెలంగాణ వర్కింగ్ ప్రసిడెంట్ నాగదక్షిణ మూర్తి, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, జీహెచ్‌ఎంసీ అధ్యక్షుడు గోపీకృష్ణ, ఉమ్మడి జిల్లాల అర్చకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

- ఏసీపీ కిరణ్ కుమార్
- పలు బైక్‌లు, ఆటోలు, కార్లు స్వాధీనం



వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి : సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కవద్దని, ప్రజలతో సత్సంబంధాల కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐదో టౌన్ పీఎస్ పరిధిలోని భారతిరాణి కాలనీ(డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పరిధి)లో పోలీసులు ఇంటింటికీ తిరుగుతూ కాలనీ వాసులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. వాహనాలపై వెళ్లే వాళ్లు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాటికి సంబంధించిన పత్రాలు వాహనాదారులు ఉంచుకోవాలని తెలిపారు. అకౌంట్ల వివరాలు ఆన్‌లైన్ ద్వారా సమాచారమడిగితే ఎవ్వరికి ఇవ్వరాదన్నారు. పిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. లక్కీడ్రా పేరుతో ఎవ్వరికీ డబ్బులు ఇవ్వరాదన్నారు. మోసపోయినట్లు గ్రహిస్తే వెంటనే డయల్ 100 లేదా 1930 కు సంప్రదించాలని, తెలియని వ్యక్తులకు ఇంటిని కిరాయికి ఇవ్వవద్దన్నారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా తప్పుడు పనులు చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. సరైన ధ్రువపత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 72 బైక్‌లు, 21 ఆటోలు, 5 కార్లు స్వాధీనం చేసుకున్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో ఐదుగురు సీఐలు, 14 ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, మహిళా హోంగార్డులు 100 మంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఒకరికి జీవిత ఖైదు

ఖలీల్‌వాడి : ఒకరిని హత్య చేసి, మరొకరిపై హత్యాయత్నం చేసిన కేసులో ముద్దాయి పెద్దలపల్లె రామయ్య(45)కు జీవితఖైదుతోపాటు ఏడేళ్ళ కఠిన జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన పెద్దలపల్లి రామయ్య, కూతురు రామయ్య మరో 8 మంది కలిసి నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌కు వలసవచ్చి ఇక్కడే మేస్త్రీ, కూలి పని చేస్తూ బతుకుతున్నారు. 2021 ఆగస్టు 2న అందరూ ఒకే రూంలో అంతా పడుకున్నారు. మధ్యరాత్రి పెద్దలపల్లె రామయ్య లేచి చూడగా ఆయన ఫోన్ కనిపించలేదు. దీంతో పక్కనే ఉన్న కూతురు రామయ్యను నిద్రలేపి తన ఫోన్ ఎక్కడని ప్రశ్నించాడు. తనకు తెలియదని పొద్దున చూద్దామని కూతురు రామయ్య అనగా వారిద్దరి మధ్య గొడవ జరిగింది. పక్కనే ఉన్న ఓబులేశు తదితరులు వారికి సర్దిచెప్పి పడుకోబెట్టారు. కాని తన ఫోన్‌ను కూతురు రామయ్యే తీసుకున్నాడని మనసులో పెట్టుకున్న పెద్దలపల్లె రామయ్య 2021 ఆగస్టు తెల్లవారుజామున లేచి సుత్తెతో కూతురు రామయ్య ముఖంపై, తలపై తీవ్రంగా కొట్టాడు. దీంతో కూతురు రామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డువచ్చిన ఓబులేషుపై కూడా దాడి చేశాడు. ఈ విషయమై ముప్కాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సెషన్స్ కోర్టు నేర న్యాయ విచారణ అనంతరం పెద్దలపల్లె రామయ్యపై హత్య, హత్యాయత్నం నేరం రుజువైనందున శిక్ష విధించినట్లు సెషన్స్ జడ్జి తీర్పు చెప్పారు.

రేకుల షెడ్లను ఢీకొన్న డీసీఎం



హన్మాజీపేట్‌లో కూలిన రేకుల షెడ్

బాన్సువాడ రూరల్ : బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్‌లో బుధవారం రాత్రి రేకుల షెడ్లను డీసీఎం వ్యాను అతివేగంతో వచ్చి ఢీకొందని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. హన్మాజీపేట్ గ్రామానికి చెందిన దొడ్ల రవీందర్ అనే వ్యక్తి రేకుల షెడ్‌లో శ్రీ సాయి హార్డ్‌వేర్, ట్రేడర్స్ దుకాణం నడుపుకుంటున్నాడు. బడాపహాడ్ నుంచి బాన్సువాడ వైపు అతివేగంతో వచ్చిన టీఎస్ 12 యూడీ 6041 డీసీఎం వాయ్‌స్ హార్డ్‌వేర్ షాప్‌నే కాకుండా పక్కనే ఉన్న మంగలి పోచయ్య కటింగ్ షాప్, వడ్ల రవీందర్‌కు చెందిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను కూడా ఢీకొంది. మద్యం సేవించి డీసీఎంను నడిపిన డ్రైవర్ నెనావత్ చరణ్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే రూ.7 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు పేర్కొన్నారు.